# శూన్యం

"**మీ**రా...!" అంది నిర్ఘాంతపోతూ, డోర్‌బెల్ మోగితే తలుపు తీసిన ఆమె ఆయన్ను చూసి. వారం రోజులుగా ఆమె వంట్లో బావుండటంలేదు. ఇవాళే కొద్దిగా నయమనిపించింది. ఆయన్ని చూడగానే ఇన్ని రోజుల నీరసం ఆమెని ఆవహించినట్లుంది.

ఆయన లోపలికొస్తుంటే ఆమె పక్కకు తప్పుకుంది. ఆయన్ను కూర్చోమనలేదు. అలా ఇచ్చి పుచ్చుకునే మర్యాదలు వాళ్ళ మధ్య వున్నట్టులేదు.

హాలు కలయజూస్తూ, చేతి సంచీ పక్కనపెట్టి సోఫాలో కూర్చుంటూ, "పిల్లలు లేరా?" అన్నాడాయన.

'పాతికేళ్ళయి వుంటుందా ఈయన్ను చూసి? మనిషిలో పెద్ద మార్పేంలేదు. జుట్టు పూర్తిగా పండిపోయింది. బాగా సన్నబడిపోయాడు. పెదవుల మీద మాత్రం ఆ నవ్వు చెరగలేదు. కానీ ఇప్పటి ఈ నవ్వులో ఆనాటి కాంతిలేదు. ఈ నవ్వు పేలవంగావుంది. ఒకప్పటి ఆ నవ్వుచూస్తే కాలరాయాలన్నంత కసి కలిగేది తనలో' అనుకుంది ఆమె.

"ఆఁ ఉన్నారు" అందామె తేరుకుంటూ. 'వాళ్ళతో మీకేం పని?' అన్న ధ్వని.

"శంకరం ఉత్తరం రాశాడు. రవిని కల్సి మాట్లాడమన్నాడు."

ఆమె ఉలిక్కిపడి మేలుకున్నట్లయింది. "ఏం మాట్లాడాలట?" అంది పెడసరంగా.

"పాతకథే... ఎవరో పిల్ల ప్రేమలో పడ్డాడట కదా, నువ్వభ్యంతరం చెప్తున్నావట..."

'పాత కథ! సంతోషంగా వున్నట్టుంది ముసలిపక్షికి' అనుకుంది ఆమె. మళ్ళీ ఆ ప్రస్తావన గుర్తుకొచ్చి మనస్తాపం కలిగింది. 'సిగ్గులేదు ఆ మేరీకి. ఓసారి బజారులో ఇద్దరూ కల్సి స్కూటరు మీద వెళ్తూంటే చూసి రవి ఇంటికి రాగానే, 'ఏమిటిరా... ఆ తిరుగుళ్ళు ఆ పిల్లతో!' అనడిగింది తను. 'మేరీ, నేనూ ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం' అని అంత సూటిగా వాడు సమాధానం చెప్తాడని తనూహించలేదు. వేరే కారణమేదో చెప్తాడని ఆశించింది. 'మీరు నిర్ణయించుకుంటే అయిపోయినట్టేనా... మాకేం సంబంధంలేదా?' అని నిలదీసింది తను. 'చెప్పిన మాట విని మామయ్యకూతురు నిరోషను చేసుకో. పిల్ల చిదిమి దీపం పెట్టినట్టుంటుంది. డాక్టరీ కూడా చదువుతోంది. దానికేం లోపం? మామయ్య కూడా దాన్ని నీకివ్వాలనుకుంటున్నాడు' అని కూడా చెప్పింది. 'నిరోష! ఏం పేరది. నీ అన్న కూతుర్ని

మాత్రం చేసుకోనమ్మా! వాళ్ళ కన్నీవున్నాయిగాని కల్చర్ లేదు' అని అంటూంటే రవిలో వాడి తాతే కన్పించాడు తనకు. కూతురు సుజాతలోనూ ఆ లక్షణాలు కన్పిస్తున్నాయి. అత్తమామల్నుండి వేరవగలిగిందిగానీ, పిల్లలతో ఎలా!'

''ఏమిటి నీకభ్యంతరం. వేరే కులమనేనా?'' అడిగాడాయన.

సుందరి తన ఆలోచనలనుండి బయటపడింది. ఉలిక్కిపడినట్లయి, ''ఆఁ మరే. ఆ పిల్లది మీ కులంకాదు. మా కులంకాదు'' అంది చిరాగ్గా.

'మీ కులమేది?' అని ఆయన అడగలేదు. ''అంతకంటే తక్కువ కులందా?'' అనడిగాడు.

'అది వర్ణాంతరమేకాదు. మతాంతరం కూడా' అని ఆమె చెప్పలేదు. 'ఈయనకి చెప్పాల్సిన అవసరం తనకేంటి?' అని కూడా అనుకుంది. అయినా, భుజం చుట్టూ పమిట కప్పుకుని, కొంగు చివరలు వేలితో మెలిబెడ్తూ తలాడించింది ఆమె, హాల్లో గది గుమ్మం దగ్గర నిలబడి.

తల్లి ఎవరితోనో మాట్లాడుతున్నట్లు విని రవి, సుజాతలు హాల్లోకొచ్చారు. ఆ సాయం వెలుగులో ముసలాయన వాళ్ళవంక కళ్ళు విప్పార్చుకుని చూశాడు. వాళ్ళకాయన ఎవరో అర్థం కాలేదు. తల్లి వంక ప్రశ్నార్థకంగా చూశారు.

''మీనాన్న నిన్ను కలవమని పంపాడట...'' అంది సుందరి కొడుకుతో.

''అవున్నాయనా, శంకరం ఉత్తరం రాశాడు. నువ్వెవర్నో ప్రేమించి పెళ్ళి చేసుకోవాల నుకుంటున్నావట. అన్ని సంగతులూ విచారించి రాయమని రాశాడు'' అన్నాడాయన.

''మీరెవరో, దీంట్లో మీ జోక్యమేమిటో నాకర్థం కావటంలేదు'' అన్నాడు రవి కోపంగా.

''నేనెవరయితే ఏంటీ మీ నాన్న పంపాడంటే అప్పుడనేగా అర్థం!'' అన్నాడాయన పేలవంగా నవ్వుతూ. ఆయనకు ఏదో గుర్తుకొచ్చింది.

రవి ఏం మాట్లాడలేదు. ఎవరో పరాయివ్యక్తితో, ఎంత తండ్రి పంపినా స్వవిషయం చర్చించటానికి అతనికి ఇష్టంలేదు. అయినా ఆ పండిపోయిన ముసలాయనను చూస్తే పరుషంగా మాట్లాడాలనిపించలేదు. ''సరే, మీకేం కావాలో అడగండి'' అన్నాడు రవి ఆయనకెదురుగా సోఫాలో కూర్చుంటూ, సుజాత సోఫా వెనక అన్న దగ్గర నిలబడింది.

''పెళ్ళంటే క్షణికావేశంలో నిర్ణయం తీసుకునేది కాదు. తల్లిదండ్రుల మాటల్ని ఆవేశంతో కొట్టి పారెయ్యక సహేతుకంగా ఆలోచించడం మంచిది.''

సుందరికి ఈయన్ను చూసినప్పటినుండీ గాబరాగానే ఉంది. 'తన మనస్తాపం చూసి ఆనందించాలనే వచ్చాడీయన. వీలయితే తనూ ఓ పుల్లవేసి సంతోషించే తత్వపు మనిషి. అసలు ఈయనకేం సంబంధం తమ కుటుంబ విషయంలో తలదూర్చటానికి' అనుకుంది.

''ఆవేశంలో తీసుకున్న నిర్ణయం కాదిది. మేరీవాళ్ళు ఉండేది ఈ వీధే. చిన్నప్పటినుండీ ఆమె మా అందరికీ తెల్సిందే. అమ్మకులం, మతం అని అభ్యంతరం చెప్తోంది. మామయ్య కూతుర్ని చేసుకోవాలని ఆమె ఉద్దేశ్యం. అది నాకిష్టంలేదు'' అన్నాడు రవి సూటిగా

''ఏం ఆ పిల్లలో లోపమేంటి?''

''లోపాల్లేని వాళ్ళందర్నీ మనం ప్రేమించలేం. నాకామె అంటే ఇష్టంలేదు అంతే.''

''మీ అమ్మా నాన్నా ఆదర్శంగా వర్ణాంతర వివాహం చేసుకున్న వాళ్ళు. నిజానికి వాళ్ళకు మతమన్నా అభ్యంతరముండదు. మతాంతరమని మీ అమ్మ అభ్యంతరం చెప్తూందని నేననుకోను.''

''కులాలు... ఎక్కడికీ పోలేదండీ. మా అమ్మకు తన కులంతో కూడా సాటిరాని కులం అమ్మాయిని కోడలుగా తెచ్చుకోవటం ఇష్టంలేదు. కులం పరిధే దాటని వాళ్ళ విషయంలో మతం సంగతేం చెప్తాం.''

సుందరి అనుకుంది 'కులం పట్టించుకోవాల్సింది కాకపోయినా, మరీ అంత తక్కువ కులం పిల్లనా తను కోడలుగా తెచ్చుకోవాల్సింది. తామూ అనుకున్నారు కులాల పట్టింపు అర్థం లేనిదని. ఏమయింది? కులం వంక కాకపోతే తనలో వంకపెట్టాల్సింది ఏముంది? పెళ్ళికొచ్చిన అత్తమామలు భోజనం చేయకుండా వెళ్ళిపోయారంటే కారణం కులంకాదూ! తనకప్పుడే అన్పించింది. వాళ్ళ కులం వాళ్ళకు గొప్పయితే తనకులం తనకు గొప్ప కాదూ అని. శంకరం తన్ను వాళ్ళింటికి రమ్మన్నప్పుడు తను స్పష్టంగానే చెప్పింది. 'మీ వాళ్ళకు కుల అహంకారం. నేనా ఇంటికి రాను' అని. 'కాదు, నీకు వాళ్ళతో పరిచయంలేదు. వాళ్ళకలాంటి భావనలేదు' అని తనకు నచ్చచెప్ప ప్రయత్నించాడు. శంకరం మొహం చూసి జాలిపడి తనా ఇంటికి వెళ్తే జరిగిందేమిటి? కుల ప్రసక్తి లేకపోతే మాత్రమేం. తన పట్ల వాళ్ళు చూపించిన అయిష్టత వాళ్ళ కులాధిక్య భావన వల్ల వచ్చింది కాదూ? నిజానికి శంకరం వాళ్ళ మాటలు వినని వ్యక్తి కాబట్టి సరిపోయింది గానీ, లేకపోతే తనని సజీవదహనం చేయగల సత్తావున్న మనుషులు కదూ వాళ్ళు. అత్త నసుగుతూనే ఉండేది. ఇదిట్లా చేశావు. అదిట్లా చేశావు అని. 'ఏంటమ్మాయి! ఆ బాత్‌రూంలో చుట్టూతా విడిచిన గుడ్డలు పడేశావు. ఓచోట కుప్పగా పెట్టరాదూ, నీ ఇష్టమొచ్చినప్పుడు తరవాత ఉతుక్కోవచ్చు. అట్లావుంటే మీ మామగారికి చిరాకేస్తుంది' అనేది. మరోసారి 'భోజనాలయాక ఆ డైనింగ్‌టేబుల్ తుడు. ఆయన చూస్తే విసుక్కుంటారు' అనేది. 'రెండో ఆట సినిమాకు వెళ్ళొద్దు. మీ మామగారికిష్టముండదు' అనేది. ఏమిటట ఆయనగొప్ప! ఆయన ఆలోచనలకు అనుగుణంగా తాము బతకాలా? తనేమనక అత్త రాక్షసితో అన్పించేవాడు. అయినా తనకు ఒకళ్ళ కులాధిక్యపు ఒద్దికలెందుకు? ఒకళ్ళ అడుగులకు మడుగులొత్తాల్సిన ఖర్మ తనకేం? శంకరం చాలు తనకు. అతనికి ఉద్యోగముంది. తమ కాళ్ళమీద తాము నిలబడగలరు.

అప్పుడే స్పష్టంగా చెప్పింది శంకరానికి తాను, 'నేను పెళ్లిచేసుకుంది నిన్నుగాని, వాళ్లనికాదు. నాకీ ఇంట్లో వుండటమిష్టంలేదు, నేను కావాలనుకుంటే వేరు కాపురం పెట్టు' అని ఎవరికీ చెప్పకుండా పుట్టింటి కొచ్చేసింది తను.'

సుందరి మనోయవనిక బయట సంభాషణ జరుగుతూనే వుంది.

''వర్ణాంతరం, మతాంతరమైన పిల్ల మీ ఇంటికొస్తుందో లేదో, పెళ్ళి కాంగానే వేరే కాపురం పెట్టమంటుందో, నిన్నసలు తమ దగ్గరకు రానిస్తుందో లేదో అని మీ అమ్మ భయమేమో...'' అన్నాడాయన.

''ఎందుకురాదు వస్తుంది. అమ్మ రానిస్తే వస్తుంది. నేనెవరి గుప్పిటిలోని మనిషికాను, శాసించి అదుపులో పెట్టటానికి...''

''ఏమో ఎవరు చెప్పగలరు.... నేను చేసుకుంది నిన్నుగాని, మీ వాళ్లనికాదు అనొచ్చుగా.''

''మేరీ ఈజ్ నాట్ దట్ సెన్స్‌లేస్ అండ్ ఇర్రేషనల్. ఓ మనిషిని పెళ్ళి చేసుకుంటున్నామంటే ఆ వ్యక్తి గతాన్నీ, భవిష్యత్తునూ, అసోసియేషన్స్‌నూ, అనుభూతులను, ఆత్మీయతలనూ అన్నిటిని పెళ్ళి చేసుకున్నట్టే లెక్క.... వాటి నుండి ఆ మనిషిని వేరు చేయలేం''

''దట్స్ గుడ్... మరి ఆ విషయం మీ అమ్మకు చెప్పకపోయావూ?'' అన్నాడాయన ఉత్సాహంగా.

''ఎవతొచ్చినా పెళ్ళి చేసుకునేది వాడినే. మమ్మల్ని చేసుకునేది ఏమిటి?'' అంది సుందరి మొహం గంటు పెట్టుకుంటూ.

''అలా అనక...వివాహబంధంలో వాళ్ళకు వాళ్ళే లోకమనుకుంటే అంతకంటే ఘోరమైన తప్పిదం మరోటి వుండదు. నువ్వో వ్యక్తిని పెళ్లి చేసుకున్నావు. అతని శరీరాన్ని చేసుకున్నావా? మనసును చేసుకున్నావా? అతని భావాల్ని, ఆత్మీయతల్ని, బంధనాల్ని అన్నిటినీ చేసుకున్నావు. ఏ వస్తువుకూ శూన్యంలో ఉనికిలేదు. పరిసరాల్లోనే వస్తువుకు మనుగడవుంది. పరిసరాలు నాకక్కరలేదు. వస్తువు మాత్రమే నాక్కావాలీ అంటే అది సాధ్యపడని విషయం. పరిసరాలను తప్పించి తన్నుకొచ్చిన మొక్క ఎండిపోతుంది. లేక జీవచ్ఛవమై బతుకుతుంది...''

ఆయన అలా ఉపన్యాసమిస్తూనే వున్నాడు. సుందరి ఆలోచనల్లో పడిపోయింది. 'మరలాంటి మనిషి స్త్రీ సంగతి ఆలోచించడేం. స్త్రీ విషయంలోనే నిజానికీ ఉపమానం సరైంది. వాళ్ళు తనకా వాతావరణం కల్పించడానికి ఏం ప్రయత్నంచేశారు? అసలు తను తన పెళ్ళికి ముందు, తన అత్తమామల్ని చూసింది లేదు. శంకరమే తన సర్వస్వమనుకుంది. అతనికి తల్లీదండ్రీ వుంటారన్న భావనే తనకు లేదు. వాళ్ళకు తమ పెళ్ళి ఇష్టంలేదు. కొడుక్కి చెప్పి చూశారు. అతను వినలేదు. గత్యంతరం లేక కొడుకు పెళ్ళి జరుగుతుంటే ఉండబట్టలేక వచ్చారు, బంధువులు, స్నేహితులు

వచ్చినట్టు. అసలు ఎవరు ఆహ్వానించారట వాళ్లని రమ్మని? తమ పెళ్ళి చేయాల్సిన బాధ్యత వాళ్ళదికాదూ? తన తండ్రికీ ఈ పెళ్ళి ఇష్టం లేదు. మరాయన నడుంకట్టి పెళ్ళి జరిపించలా? వాళ్ళు పెళ్ళయిందాకా వుండి, లేచి చక్కాపోయారు. వాళ్ళేం వాతావరణం కల్పించ ప్రయత్నించారు?'

''ఎవరేమనుకున్నా నాకు లెక్కలేదండీ? నేను మేరీని చేసుకునేది ఖాయం'' అన్నాడు దురుసుగా రవి. అంతకుముందు వాళ్ళమధ్య మాటలేం నడిచాయో వినలేదు సుందరి.

''అది సరైన మాట కాదు. ఓ శిల్పి ఎన్నో ఏళ్ళు కష్టపడి చక్కటి బొమ్మను చెక్కాడు. ఆ ప్రతిమను రోజూ చూసుకుని అతను అసంతృప్తి పొందేవాడు. ఎక్కడో ఏదో లోపం కన్పించేది. మెరుగులు దిద్ద ప్రయత్నించేవాడు. ఇలా కాదు, ఇంకా అందంగా మలచవచ్చు దీన్ని, అని అనుకునేవాడు. అలా చేయ ప్రయత్నించేవాడు. అది తన సౌందర్య దృష్టికి శిఖరాయమానమైన రూపకల్పనగా వుండాలని భావించేవాడాయన. మానవ సృజనకు పరిపూర్ణతలేదని అతనికి తెలియకపోలేదు. కానీ మానవ సహజ ఆరాటం. ఈ శిల్పిని చూస్తున్న ప్రతిమకు చిరాకు వేసేది. అటుగా రోజూ బడికి వెళ్తున్న ఓ అమ్మాయి కన్పించిందా ప్రతిమకు. చూడగానే ప్రేమలోపడి పోయిందా బొమ్మ. అమ్మాయి కూడా బొమ్మ తనను రోజూ చూడటం గమనించింది. ఆమెకూ బొమ్మ నచ్చింది. ఓ రోజు ఆ అమ్మడు శిల్పితో పేచీ పెట్టుకుంది. 'ఈ బొమ్మనాదీ, నాకిచ్చెయ్యి' అంది. 'నువ్వు నచ్చలేదు నాకు, నేనివ్వనన్నాడు శిల్పి.' 'ఆ బొమ్మ నన్ను వలచింది. నిజానికి నేను పట్టనట్టేవున్నాను. నేను లేకపోతే బతకలేనని మీ బొమ్మే అంది. నువ్వు చెప్పు బొమ్మరాజా! నువ్వు నా వెంట పడ్డావా, నేను నీ వెంటపడ్డానా!' అని అంది. దానికా శిల్పి అన్నాడు కదా, 'నువ్వు నా బొమ్మవంక చూడకపోతే, నా బొమ్మ నిన్ను చూసింది అని ఎట్లా చెప్పగలిగావు? కనుక ఇలాంటి నంగనాచి కబుర్లాడక... నువ్వేం పత్తిత్తువుకాదు' అని. కాని ఆపిల్ల యౌవనపు పొంగులోవుంది. శిల్పి ఏమరుపాటున ఉన్నప్పుడు, ఆ బొమ్మనే ఎత్తి, అతని తలబాది, బొమ్మనెత్తుకుపోయింది ఆ అమ్మాయి. ఆ శిల్పికి గాయం అయి స్పృహ తప్పి పడిపోయాడు. తెలివొచ్చిన తర్వాత కూడా తన ఉలి చేతిలో మైనం ముద్దలా లొంగిపోయిన ఆ ప్రతిమకంత కఠినత్వం ఎలా వచ్చిందో అర్థం చేసుకోలేకపోయాడా శిల్పి. మరి ఆ శిల్పి అంటే లెక్కలేదా నీకు?'' అడిగాడాయన.

సుందరికాయన మాటలు అర్థమవుతూనే వున్నాయి. తనాడిన మాటలే ఆయన ప్రయోగిస్తున్నాడు.

''బాగుంది తాతగారు! మంచి కథ చెప్పారు.... మిమ్మల్ని తాతగారు అనొచ్చో లేదో'' అంది సుజాత ముసలాయన వంక చూస్తూ.

''అనమ్మా! అను... ముసలివాళ్ళని తాత అనక ఏమంటారు!'' అన్నాడాయన చిద్విలాసంగా

నవ్వుతూ, సుందరివంక చూస్తూ. మళ్ళీ రవి వేపు చూస్తూ అన్నాడు, ''బొమ్మ అమ్మాయిని వలచింది కనుక కట్నం కానుకలుండవు. మరి గుర్తుంచుకో'' అని.

''కట్నం, కానుకలా? వాటి ప్రసక్తేలేదు...'' అన్నాడురవి.

'కట్నం కానుకల ప్రసక్తి లేకపోయినా మా కోడలికేం మేం తక్కువ చేయలేదు' అని అందరి ఎదుటా ప్రదర్శించటానికి గదూ తన అత్తమామలు, పెళ్ళిలో తనకు చీరెలూ, గొలుసూ పెట్టింది? ఇంతా చేస్తే ఏం చీరెలవి? ఒక్కోటీ ఐదొందలకు మించదు. ఆ చీరెలు చూసినప్పుడే వాళ్ళంటే మొదటిసారిగా అసహ్యమేసింది తనకు. తను శంకరం బలవంతంమీద వాళ్ళింటికెళ్ళినప్పటినుండీ, తనకోసం ఏదో గొప్పగా చేస్తున్నట్టు, తనకోసం ప్రత్యేకంగా తనకిష్టమైన హేరాయిల్, షాంపూ, సబ్బులు తేవటం. మా కోడల్ని గొప్పగా చూస్తున్నామన్న ప్రదర్శనకు కాకపోతే ఇదంతా ఎందుకు? ఒకవేళ పొరపాటున ఆ మేరీగానీ తన కోడలయితే, వాళ్ళలా తను మాత్రం అనవసరపు గొప్పలకుపోదు. ముక్కుపిండి ఆ పాల్‌గాడి నుండి రావల్సిందంతా వసూలు చేసే వదులుతుంది.'

తన ఆలోచనల్లో మునిగిపోయిన సుందరి, మేరీ ఇంట్లోకి రావటం గుర్తించలేదు.

''రా మేరీ! రా... వారు మాడాడీకి తెల్సినవారు...'' అంటూ పరిచయం చేసింది సుజాత మేరీకి.

ముసలాయన ఆమె వంక చూశాడు. ఆమె వయసు 22, 23 ఏళ్ళువుంటాయేమో. చక్కని రూపు రేఖలే. ముఖం ప్రసన్నంగా వుంది. ''నువ్వేనటమ్మా మేరీవి. మా రవీ, నువ్వూ...'' అని నవ్వాడు ఆయన.

మేరీ నవ్వుతూ ఆయన వంక చూసి తలాడించింది.

సుందరికక్కడ వుండటం కంపరంగా వుంది. ఆయన వచ్చినప్పటినుండీ ఆమె నిల్చునే ఉంది. కాళ్లు పీకుతున్నా లోపలకు వెళ్ళబుద్ధి కాలేదామెకి. తను లేకపోతే ముసలాయన పిల్లలకేం నూరిపోస్తాడో అని ఆమె భయం. ఆపైన మేరీ రావటం భరించరానిదయింది ఆమెకు. 'సిగ్గూ ఎగ్గూ లేని మొహంది. పిల్లలు లేనప్పుడు తమింటికొచ్చిన మేరీతో తను స్పష్టంగా చెప్పింది, 'నువ్వు మా ఇంటికి రావద్దు. మా వాడితో స్నేహం మానెయ్యి. వాడికీ నీకూ పెళ్ళి జరిగే పనికాదు. నా కంఠంలో ప్రాణం వుండగా జరగనీయను' అని. ఓ నెల రోజులు మానేసిందేమో తమింటికి రావటం. మళ్ళీ రాకపోకలు సాగించింది. ఇప్పుడు రవి ఇంట్లో వుండే సమయం చూసి వస్తుంది. రవి వుంటే తను ఏమీ అనదని అనుకుంటోంది కాబోలు. ఓ రోజు వాయించి పారేస్తుంది. ఆ ముసలిముండా కొడుకు పాల్ కూతుర్ని కని, బజారున వదిలేశాడు. 'నీక్కావాల్సిన వాడిని కట్టుకోవే అమ్మా, కట్నకానుకలు తప్పుతాయి' అని. ఓ సారి వెళ్ళి వాడిని ఝాడించి రావాలి.'

ముసలాయన వివరంగా సమాచారం రాబట్టుతున్నాడు. ''ఉద్యోగం చేస్తున్నావన్నమాట. మరి ఇంట్లో పనులు చేసుకోవటం, నీకు కష్టమే అవుతుంది. వెసులు బాటుండదేమో...''

''ఎందుకుండదండీ, మా ఇంట్లో పనంతా సామాన్యంగా నేనే చేస్తుంటాను. మా నాన్న సాయం చేస్తుంటారు. మా అమ్మకు ఒంట్లో బావుండదు. ఓ రోజు లేస్తే నాలుగు రోజులు పడకేస్తూ వుంటుంది.''

''పుట్టింట్లో చేస్తున్నావు సరే, రేపు అత్తింటి కొచ్చినప్పుడు కష్టమనిపిస్తుందేమోనని. కోడలు వస్తూందంటే పనిలో ఆసరాగా వుంటుందని అత్త ఆశపడటం సహజంకదా! అందుకని అడుగుతున్నాను...''

సుందరి మేరీ ఏ సమాధానం చెప్పిందో వినలేదు. ఆమెకు ఆయన మాటలు అర్థమవుతూనే వున్నాయి. 'తనేం ఉద్యోగం చెయ్యలేదు. అత్తింటికే అయిష్టంగా వచ్చింది. అత్త పని చేయమన్నప్పుడల్లా చిరాకనిపించేది. కొత్తకోడల్ని ఎంత గారంగా చూసుకోవాలో వాళ్ళకు తెలీదు. అత్త ఏపనయినా చెప్తే తనకు చేయాలనిపిస్తే చేసేది. ఇష్టంలేకపోతే తను ఆమె మాటల్ని విననట్టు ఊరుకునేది. మరోసారి తనకు పని చెప్పని అహంకారం ఆమెది. ఓసారి చెప్పి చూసి తను చేయకపోతే ఆ పని తనే చేసుకునేది. తను పుట్టింట్లో మాత్రం అమ్మచెప్పిన పన్లన్నీ చేసేదా? తనకిష్టమైతేనే చేసేది. అయితే మామ ఊరుకునేవాడు కాదు. 'అన్నీ నువ్వే చేసుకోకపోతే ఆ పిల్లకు చెప్పి చేయించుకోరాదూ' అనేవాడు. 'ఆఁ మీ ఇంట్లో పని చేయటానికే వచ్చాను నేను దాసిని!' అనుకునేది తను. పైకి ఏమీ అనలేకపోయేది. ఆయన నోరు మంచిది కాదు. ఏమైనా కుయ్యగలడు. అందుకనే ఆయన కన్పిస్తే తప్పుకు తిరిగేది తను. అత్తింటికొచ్చిన వారంరోజుల్లోనే శంకరానికి చెప్పేసింది తను 'నా వల్లకాదు ఈ బండెడు ఇంటి చాకిరీ చేయటం. పని మనిషికి పనులు చెప్పి చేయించుకోటానికి దానికి గారం. నేనే దొరికానా వాళ్ళకు వెట్టికి?' అని. 'మన ఇంట్లో మనం పనులు చేసుకుంటే తప్పేం?' అన్నాడు శంకరం. 'ఇది మన ఇల్లు! మన పని!' అని ఈసడించి గదిలోంచి బయటకుపోయింది తను.'

''అలాగా! మీ నాన్న రిటైరయిపోయారన్న మాట. ఎంతైనా ఆడపిల్లతండ్రి కదా, మీ నాయన వచ్చి రవి తల్లితో ప్రస్తావించవచ్చు కదా మీ పెళ్ళి విషయం'' అన్నారాయన.

''వస్తారండీ... ఇవాళో రేపో వద్దామనుకుంటున్నారు. దాపరికంతో ఏ పనీ చేయరాదంటారు మాడాడీ'' అంది మేరీ రవి వంకచూసి నవ్వుతూ.

'ఆఁ వస్తారు... రానీ... వస్తే వాళ్ళ ముఖాన పేడ కళాపి చల్లకపోతే నాపేరు సుందరి కాదు'

''మరి మావాడు మీ మతంలోకి మారాలటమ్మా!''

చూస్తే ఈ ముసలాయన వాడికి క్రైస్తవ మతం ఇప్పించి కాని వదిలేట్టులేడు. 'వచ్చి చేసిన

నిర్వాకం చాల్లే, ఇంక దయచేయండి' అని నోటి దాకా వచ్చింది కాని, సాహసం చేయలేకపోయింది సుందరి.

''అక్కర్లేదండీ... మతం వ్యక్తిగత విషయం. నిజానికి నేనెంత క్రైస్తవ యువతినో నాకే తెలీదు'' అంది మేరీ.

''బావుంది... చక్కని ఆలోచనలున్నాయి నీకు. నేను శంకరానికి బాగా కావాల్సినవాడిని. ఎలాగూ ఇంత దూరమూ వచ్చాను, మీ నాయన్నీ కలిసే వెళ్తాను...'' అన్నాడాయన.

సుందరికి అన్పించింది. 'ఇంత సద్బుద్ధి ఆనాడు లేదేం ఈయనకు. శంకరం తండ్రి అంటే భయపడేవాడు. తన వాళ్ళు వచ్చి మీ నాయనతో మాట్లాడతామంటే 'అక్కర్లేదు, వాళ్లకీ పెళ్ళి అంగీకారం కాదు. పెళ్ళి వారంరోజులుండనగా మాత్రమే వాళ్ళకు తెలియాలి. అదీ నేనే చెప్తాను' అన్నాడు. ఏం చెప్పాడు! వారానికి పెళ్లనగా ఉత్తరం రాశాడు తండ్రికి. ఆ వారంలో ఏం రాద్ధాంత సిద్ధాంతాలయ్యాయో తనకు తెలియదుగానీ పెళ్ళికి మాత్రం వచ్చారు వాళ్ళు. అంత కులహంకారం వున్న మనుషులు పెళ్ళికి వచ్చినా పట్టించుకోవాల్సిన అవసరంలేదు అనేశాడు తన తండ్రి. స్నేహితులూ, బంధువులూ వచ్చినట్టే వాళ్ళూ వచ్చారు. వెళ్ళారు. తనువాళ్ళింటికి వెళ్ళినప్పుడు- నిజానికి తన్ను కాపురానికి పంపించటమనేదే జరగలేదు. ఎక్కడకు పంపిస్తారు? అత్తింటిని తాము గుర్తించనేలేదు. శంకరం బలవంతం మీద అక్కడకు వెళ్తే వెళ్ళిన రోజే అత్త సాధించనే సాధించింది. 'కొడుకు పెళ్ళి అని వస్తే, కనీసం పట్టించుకున్న వాళ్ళేలేరు' అని. నిజానికెవరు పట్టించుకుంటారు? ఈ అహంకారపు మనుషులు ఏమంటే, మరేమంటారో ఎవరికి తెల్సు కనుక! అక్కడికీ ఊర్కోలేదు, 'మా పిన్నీ వాళ్లు పలకరించలేదూ' అంది. 'బయటివాళ్ళు పలకరిస్తేనేం, లేకపోతేనేం, మీ నాయనకూ, అమ్మకూ మా సంగతి పట్టకపోయాక... కనీసం టీ నీళ్ళు పోసే మర్యాద కూడాలేని సంత దొరికింది మాకు!' అంది ఆమె. 'పెళ్ళి పనుల్లో తీరిక లేదు వాళ్ళకు. తీరుబాటుగా అందర్నీ పలకరించటానికి' అని అనేసింది తను. చూసి కావాలనే వాతపెట్టింది. అత్త తీరుకంటే మామ ప్రవర్తన తనకు దుర్భరంగా ఉండేది. తిట్టినా తన వాళ్ళున్నారని గుర్తించేది అత్త. ఆయన తనకు తల్లీతండ్రీ వున్నట్టే ప్రవర్తించేవాడుకాదు. పొగరు మనిషికి.'

వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో సుందరి వినలేదు. అంతా కలసిపోయి మాట్లాడుకుంటున్నారు. ఆయన వాళ్ళని ఆకట్టేసుకున్నాడు. 'ఈ భయంతోనే తను శంకరం తరఫువాళ్ళతో తెగతెంపులు చేసుకుంది' అనుకుంది ఆమె.

''ఆంటీకి వంట్లో బావుండటంలేదని రవి చెప్పాడు. ఎలా ఉన్నారో చూసి వెళ్దామని వచ్చాను'' అంటోంది మేరీ.

''పెళ్ళి కాలేదు కనుక ఆంటీ ఆరోగ్యం తెలుసుకోవచ్చావు సరే, పెళ్ళయింతర్వాత కూడా ఇంత సహృదయత వుంటే మంచిదే'' అంటున్నాడు ఆయన.

సుందరి మళ్ళీ గత జ్ఞాపకాలలో పడిపోయింది. 'ఓసారి ఇలాగే అయింది. 'నాన్నకు వంట్లో బావుండటంలేదు. చూసి వద్దాం పద' అన్నాడు శంకరం. 'నేను రాను. నన్నక్కడకు బలవంతంగా తీసుకువెళ్ళావో, నేను ఆత్మహత్య చేసుకుంటాను' అంది తాను. అసలు తనకేం సంబంధం ఆ ఇంటితో. శంకరం ఏం మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. వెళ్ళినవాడు వారం రోజులదాకా అయిపులేడు. ఏమయ్యాడో వాళ్లేం చెప్పి అతని మనసు విరిచేస్తారోనని తనెంతో దిగులుపడింది. అప్పుడే తనకు మొదటిసారిగా ఆలోచన వచ్చింది. 'నువ్వు ట్రాన్స్‌ఫరుకు అప్లయి చెయ్యి. వాళ్ళున్న ఊళ్ళో నాకుండటం ఇష్టంలేదు' అని పోరగా పోరగా విన్నాడు శంకరం. చాలా దూరంగా విశాఖపట్నం నుండి హైదరాబాదు బదిలీ చేయించుకున్నారు తాము. పీడా విరగడయిపోయింది అనుకుంది తను.

'దూరంగా తాము వెళ్ళిపోయారుకాని, శంకరం మునుపటి మనిషిలాలేడు. ఏదో శూన్యం, నిశ్శబ్దం ఆవరించిందతనిలో. శంకరం తననుండి కూడా పారిపోయే ప్రయత్నం చేస్తాడని తనూహించలేదు. తనకు హాయిగా, మరింత సుఖంగా బతకాలనుండేది. శంకరం సంపాదన చాలేదికాదు. 'మీ నాయన దగ్గరకెళ్ళి ఆస్తి పంచుకురా' అని సలహా ఇచ్చింది తను. శంకరానికి తండ్రిని డబ్బు, ఆస్తి అడగటం ఇష్టంలేదు. 'నీకు కావాల్సింది డబ్బేకదా! నేను ఆలోచిస్తానులే' అన్నాడు. 'నీకు మాత్రం అవసరం లేదా, ఓ ఇల్లు కట్టుకోవాలనీ, అందర్లో బాగుండాలని నీకు మాత్రం లేదా?' అంది తను. అయితే అతని ఆలోచన తననుండి పారిపోవటానికని తననుకోలేదు. మస్కాట్‌లో ఉద్యోగానికి అప్లయిచేశాడు. పాస్‌పోర్ట్, వీసా వచ్చింతర్వాతగాని తనకు తెలియలేదు. అతను ఇక్కడి ఉద్యోగానికి రాజీనామా చేసి, మస్కాట్‌కి వెళ్ళ సిద్ధమైనప్పుడు తను అరిచిగోల చేసింది. 'నువ్వెళ్ళటానికి వీలులేదు. అంతగా అయితే నన్నూ, పిల్లల్నీ కూడా తీసుకెళ్ళు' అని. 'ఎందుకూ, ప్రతి ఏడూ రెండు నెలలు సెలవమీద రానూ? మహా అయితే రెండు, మూడేళ్ళు కష్టపడాల్సి వుంటుంది అంతే.' అని వెళ్ళిపోయాడు. అది రెండు మూడేళ్ళుకాదు. ఇప్పటికి పదేళ్ళనుండి అక్కడే వుంటున్నాడు. ప్రతి నెలా డబ్బు పంపిస్తున్నాడు. ఆ డబ్బుతో తామీ చక్కటి భవంతి కట్టుకోగలిగారు. పిల్లలకు మంచి మంచి చదువులు చెప్పించగలిగారు. నిజానికి గల్ఫ్ యుద్ధమప్పుడు తనెంత తల్లడిల్లిపోలేదు. ప్రాణాలు అరచేత పెట్టుకు బతకలేదూ? శంకరం తండ్రి అంటే అందుకే తనకు మంట. బాగా ఆస్తి వున్నవాడే ఆయన. కొడుక్కివ్వకుండా కట్టుకుపోతాడా? కనీసం శంకరం భాగం ఆస్తి పంచి ఇచ్చినా, శంకరానికి పరాయిదేశం వెళ్ళి కష్టపడాల్సివచ్చేది కాదు. అందుకే ఏ సంవత్సరానికో, రెండేళ్ళకో శంకరం ఇంటికి వచ్చి 'ఓసారి వెళ్ళి మా అమ్మానాన్నను చూసి వస్తాను' అని అన్నా తను పడనిచ్చేది కాదు. 'ఆయన నీకేం చేశాడు కనుక. ఆస్తిలో భాగం ఇచ్చినట్లయితే మనకిన్ని తిప్పలుండేవి కావుకదా! అయినా వచ్చిన నెలరోజుల్లో, వారంరోజులు అమ్మానాన్నని చూస్తానని వెళ్తే, నువ్విక్కడ ఉన్నట్టే వుండదు. వాళ్ళ కొడుకు చచ్చాడని ఊరుకున్నారు. నీకు మాత్రమేం పట్టింది. నేను మాత్రం మా

పుట్టింటికెప్పుడూ వెళ్తున్నానా? ఈ నెల రోజులూ నువ్వెక్కడకూ వెళ్ళాల్సిన పనిలేదు. పిల్లలూ నాన్న మన దగ్గరే వుండడు అనంటున్నారు,' అనేది తను. శంకరం అక్కడకు వెళ్ళలేదుగాని, తమ దగ్గరున్నంతకాలం అన్యమనస్కంగానే గడిపేవాడు. అతనిలో ఇదివరకటి ప్రేమ లేదనిపిస్తోంది'

''మరి వస్తానమ్మా సుజాతా! వస్తా బాబూ!'' అని రవితో చెప్పి సుందరి వంక చూసి నవ్వాడాయన వెళ్ళివస్తానన్నట్టు. ''పద తల్లీ! మీ ఇంటికొచ్చి, మీ నాయనతో మాట్లాడే వెళ్తాను. ఆపైన శంకరానికి ఉత్తరం రాస్తే నా బాధ్యత తీరిపోతుంది'' అని మేరీని అనుసరించాడాయన.

సుందరి ఏం మాట్లాడలేదు. చూస్తుండిపోయింది. 'మరి అంత ఎంక్వైరీ కొచ్చినవాడు ఈ పెళ్ళి తనకిష్టమాకాదా అని అడగలేదే. అవసరం లేదనుకున్నట్టున్నాడు' అనుకుంది సుందరి.

''కాఫీ తాగి వెళ్దురు తాతగారు, ఉండండి'' అంది సుజాత. సుందరి కూతురివంక చిరాగ్గా చూసింది.

''అక్కర్లేదమ్మా! నాకు అంతగా కాఫీ తాగే అలవాటు లేదు'' అన్నాడాయన వెళ్తూ.

''అయ్యో, మీ సంచీ మర్చిపోయారు'' అని సంచీ తీసి ఆయన కందించాడు రవి.

ఆయనా, మేరీ వెళ్ళిపోయారు.

''ఇదేమిటీ ఉత్తరం. ఆయన సంచీలో నుండి జారిపడిపోయినట్లుంది'' అంది సుజాత సోఫాపక్కన పడున్న ఏరోగ్రాం మడతనిప్పి చదువుతూ.

''ఇంతకీ ఎవరమ్మా ఆయన?'' అడిగాడు రవి తల్లిని.

సుందరేం మాట్లాడలేదు. 'చివరకు ముసలాయన తనేం చేయదల్చుకుని వచ్చాడో, ఆ పనిచేసే వెళ్ళిపోయేట్లున్నాడు. ఆ పాపిష్టిది, దాని తండ్రి మంచివాళ్లు, సంబంధం కలుపుకోవచ్చు అని రాస్తాడేమో. ఈ పెళ్ళి ఎలా ఆపాలి? అరిచి గోలపెట్టి తనకిష్టంలేని పని మానిపించటానికి శంకరం ఇక్కడలేడు. పిల్లలు తనెంత మొత్తుకున్నా తమకు తోచిందే చేస్తారుగానీ, తనకు ఇష్టంలేదని మానరు. అసలు శంకరం ఆ ముసలాయనకు ఉత్తరం రాసిందెందుకు? ఏమయినా ఈ పెళ్ళి ఆపాల్సిందే. శంకరానికి ఫోను చేసి పిలిపించాలి' అనుకుంది ఆమె.

ఉత్తరం చదవటం పూర్తిచేసి, అన్నకిస్తూ అంది సుజాత, ''అది డాడీ తాతకు రాసిన ఉత్తరం'' అని.

''తాతా...! ఏ తాత... ఎవరి తాత?'' అడిగాడు రవి.

''ఆ వచ్చినాయన మన తాత. నాన్న నాన్న. విశాఖపట్నం నుండి పడ్తూలేస్తూ వచ్చిన ముసలాయన్ని ఓ పూట నువ్వుండమనలేదు సరే, కనీసం కప్పు కాఫీ కూడా ఇవ్వలేదు. ఆయనంటేనే నీకెంత అసహ్యంవున్నా, నాన్న తండ్రిని అంతగా అవమానించాల్సిన పనిలేదు'' అంది సుజాత తల్లివంక అసహ్యంగా చూస్తూ.

సుందరి స్తంభీభూతురాలై చూస్తుండిపోయింది.

''ఆ వచ్చిన మనిషి తాత అని చెప్తే, నీ నోటి ముత్యాలు రాలిపోతాయా అమ్మా! నువ్వు చేసిన తప్పును మేం కంటిన్యూ చేయాలని వుందా? ఆయన అన్ని పరామర్శలు చేస్తుంటే, మేం ఆయన మా తాతగారని తెల్సుకోలేకపోయాం. ఎలా తెలుస్తుంది మాకు? నాన్నకు తల్లీ తండ్రీ వున్నారన్న స్పృహే నువ్వు మాకు కలగనివ్వలేదు. మేం వెళ్ళి ఆయన్ని ఇంటికి తీసుకువస్తాం...'' అన్నాడు రవి కోపంగా ఉత్తరం మడిచి జేబులో పెట్టుకుంటూ.

''అక్కర్లేదు... మీరాయన్నిక్కడకు తీసుకువస్తే, నా శవాన్నే చూస్తారు'' అంది సుందరి ఆవేశంతో.

''అమ్మా! ఇలాంటి బెదిరింపులు బెదిరించే నాన్నని ఇంటి ఛాయలకు రాకుండా చేశావు. మేం నాన్నకాదు భయపట్టానికి. మేం వెళ్తున్నాం. ఆయనంటే, వాళ్ళంటే నీకెందుకు కోపమో, అసహ్యమో మా కనవసరం. వాళ్ళు ఎంత దుర్మార్గులయినా, ఆయనకు తన కొడుకింట్లో ఓపూట వుండే అర్హత లేదా?'' అంది సుజాత, కాళ్ళకు చెప్పులేసుకుని అన్నతో కల్సి బయటకు వెళ్తూ.

'ముసలాయన తనపై పగ తీర్చుకున్నాడు' అనుకుంది సుందరి. చీకటి పడిపోయింది. లైటేసే ఓపిక కూడా లేనట్టు సోఫాలో కూలబడిపోయింది ఆమె. ఇల్లంతా నిశ్శబ్దంగా శూన్యంగా ఉంది. ఈ నిరీహ సంధ్యలో ఈ నీరవ నిష్ఠుర శూన్యం భరించరానిదిగా వుంది. శంకరంతో తను వాళ్ళ ఇంటినుండి బయటపడినప్పుడు ఆ ఇంట్లోనూ ఇంతే నిశ్శబ్దం, శూన్యం ఆవరించి వుండాలన్న ఆలోచన మొదటిసారిగా ఆమె మదిలో మెదిలింది.

'విపుల' మాసపత్రిక
మే, 1993